క్లుప్తంగా

పెనమలూరు హెచ్‌ఎంకు ప్రతిభా పురస్కారం



పెనమలూరు: విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందించిన పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవానిని కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో విశేష సేవలు అందించినందుకు హెచ్‌ఎంకు పురస్కారం అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారిక, జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా పాల్గొన్నారు.

పెనమలూరులో గడ్డివాము దగ్ధం

పెనమలూరు: పెనమలూరులో కౌలు రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమయింది. గ్రామానికి చెందిన కౌలు రైతు ఎస్.కోటేశ్వరరావు తన ఇంటి వద్ద వేసిన మూడు ఎకరాల గడ్డివాములో బుధవారం రాత్రి ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు లేచాయి. స్థానికులు అగ్నిమాపక దళానికి ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అయితే అప్పటికే గడ్డివాము చాలా వరకు కాలిపోయింది. నష్టం దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని రైతు కోటేశ్వరరావు తెలిపారు. ప్రమాద కారణాలు తెలియలేదు. ఘటనా స్థలం వద్దకు రెవెన్యూ సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేశారు.

పీవీపీలో సితార్- 2023

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో టెక్నో కల్చరల్ ఫెస్టివెల్ సితార్-2023 నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ మార్చి 10,11 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో విజేతలకు రూ.5 లక్షల వరకు బహుమతులు అందజేస్తామన్నారు.

విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్ల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. నున్న గ్రామ సచివాలయం 3 పరిధిలో హృదయనగర్ కాలనీ ఎలిమెంటరీ పాఠశాలలో, సచివాలయ 2 పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు కూడా ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు.

కంటి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

కంకిపాడు: కంటి వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన 89 మంది వృద్ధులకు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

పోలీసు కేసు పెట్టిందని భార్యపై దాడి

పెనమలూరు: భర్తపై పోలీసు కేసు పెట్టడంతో ఆగ్రహించిన భర్త మళ్లీ భార్యపై దాడి చేశాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన లావణ్య కొద్ది సంవత్సరాల క్రితం అవనిగడ్డకు చెందిన లీలాకృష్ణను వివాహం చేసుకుంది. భార్యభర్తల మధ్య విభేదాలు రావటంతో భార్య కానూరులో పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 7వ తేదీన లీలాకృష్ణ భార్య లావణ్య వద్దకు వచ్చి ఆమెను బెదిరించి దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్ ఇచ్చారు. అయితే ఈ నెల 8వ తేదీన లావణ్య కానూరులో పనిచేస్తున్న కాలేజీ వద్దకు భర్త లీలాకృష్ణ వెళ్లి మరల ఆమెను బెదిరించి దాడి చేశాడు.ఈ ఘటనపై భార్య మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వినాయక్‌నగర్‌కు చెందిన శీలం నాగదుర్గ మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త డెకరేషన్ వర్కు చేస్తాడు. అయితే కొంతకాలంగా భర్తతో పాటు బావ శీలం నాగరాజు, బంధువులు వీరమ్మ, నాగమ్మ నాగదుర్గను అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

- 35 లేఅవుట్లలో 7,303 మందికి స్థలాలు
- 4600 మంది ఇళ్ల నిర్మాణాలకు రిజిస్ట్రేషన్‌లు
- ఉగాది నాటికి లక్ష్యాన్ని మించి గృహప్రవేశాలు చేసేందుకు సన్నాహాలు


వీరపనేనిగూడెం లేఅవుట్‌లో శరవేగంగా గృహ నిర్మాణాలు

గన్నవరం రూరల్: మండలంలో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కొనసాగుతున్న గృహాల నిర్మాణం శరవేగంగా ముందుకు నడుస్తోంది. ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ ప్రభుత్వం చేయూతనందిస్తూ లబ్ధిదారుల కళ్లలో వెలుగు రేఖలు నింపింది. గన్నవరం మండలంలో మొత్తం 21 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని పేదలందరికీ ఇంటి నివేశన స్థలాలు ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 35 లేఅవుట్లలో 7,303 మందికి ఇంటి నివేశన స్థలాలు ఇచ్చారు. వీరిలో 4,600 మంది ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బేస్‌మెంట్ లెవెల్ 554, రూఫ్ లెవెల్ 61, శ్లాబులు 46, మొత్తం ఇంటి నిర్మాణాలు 275 మంది పూర్తి చేసుకున్నారు. బేస్‌మెంట్ లెవెల్ మించి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు 936 మంది ఉన్నారు.

గ్రామాల వారీగా పూర్తయిన ఇళ్లు	
కేసరపల్లి	28
బుద్ధవరం	66
వెదురుపావులూరు	19
గన్నవరం	53
జక్కులనెక్కలం	25
తెంపల్లి	2
వీరపనేనిగూడెం	25
సూరంపల్లి	8
గొల్లనపల్లి	13
మెట్లపల్లి	6
చిన్న అవుటపల్లి	24
సావరగూడెం	21
అల్లాపురం	24

ఉగాది నాటికి 831 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం

ఉగాది నాటికి 831 గృహాలు పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ లక్ష్యంగా నిర్ణయించింది. గన్నవరం హౌసింగ్ డీఈ వెంకటేశ్వరరావు సారథ్యంలో ఏఈ శ్రీకాకుళపు సత్యన్నారాయణ(సాయి), సిబ్బంది ఇప్పటికే 572 ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించారు. కేసరపల్లి లేఅవుట్‌లో 570 మందికి రాళ్లు పాతి వారి నివేశన స్థలాలు చూపించేందుకు రెవెన్యూ శాఖ పనిచేస్తోంది. రెండవ లేఅవుట్‌లో 8 గ్రామాల లబ్ధిదారులకు కూడా స్థలాలు చూపేందుకు పనులు పూర్తి చేశారు. మౌలిక వసతులను ఇప్పటికే కల్పించి లబ్ధిదారులను వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టవలసిందిగా పలుసార్లు కోరారు. నీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాల కల్పన జరిగింది. గృహాలు నిర్మించుకునే వారికి శాఖా పరంగా 90 కట్టల సిమెంటు, అర టన్ను ఇనుము, అల్యూమినియం డోర్ ఫ్రేమ్స్, విండోస్, వైట్ సిమెంట్, ఎలక్ట్రిక్ సామానులు, డోర్ షట్టర్‌లు సిద్ధంగా ఉన్నాయి. గృహ నిర్మాణ శాఖ రూ.1.50 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.30 వేలు లబ్ధిదారులకు అందిస్తున్నారు. సొంత స్థలం కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు 585 మందికి ఇప్పటికే 323 గృహాలు నిర్మాణం పూర్తయ్యాయి. మరింత వేగంగా గృహాలు నిర్మించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు.

ప్రభుత్వ సహకారంతో ఇళ్లు నిర్మించుకోవాలి



ప్రభుత్వం గృహ నిర్మాణాల లబ్ధిదారులకు ఎంతో చేయూతను అందిస్తోంది. మెటీరియల్, బిల్లులు వేగంగా అందజేస్తున్నాం. మిగిలిన లబ్ధిదారులు కూడా ముందుకు వచ్చి వెంటనే గృహ నిర్మాణాలు ప్రారంభించాలి.

-శ్రీకాకుళపు సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ గన్నవరం

సొంత ఇంటి కల నిజంచేశారు



జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకున్నాం. నిరుపేదలమైన మాకు సొంత ఇంటి కల నిజం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నిరుపేదలకు ఎందరికో ఈ ప్రభుత్వం మేలు చేసింది. అందరూ ఇళ్లు కట్టుకుంటున్నారు. ఊళ్లు నిర్మిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికి చెందుతుంది.

-జలసూత్రం నాగలక్ష్మి, లబ్ధిదారు

ప్రభుత్వ సహకారం ఎంతో గొప్పగా ఉంది



మాకు సొంత ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇచ్చింది. మాతో పాటు మరెందరికో ఇళ్లు నిర్మిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. నివేశన స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్నారు.

-బొమ్మారెడ్డి సీతామహాలక్ష్మి, వీరపనేనిగూడెం

3078 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు స్వాధీనం

- త్వరగా గృహాలు నిర్మాణం చేయండి
- తాడిగడప మున్సిపల్ కమిషనర్ ప్రకాశరావు


వణుకూరుకు వచ్చిన కానూరు లబ్ధిదారులు

పెనమలూరు: కానూరు గ్రామస్తుల చిరకాల కల సాకారమయింది. గత 30 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న పేదల్లో ఆనందం వెల్లువెత్తింది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశాలతో కానూరు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన వణుకూరు జగనన్నకాలనీ లేఅవుటు-3లో దాదాపు 75 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అక్కడ గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో గురువారం 3078 మందికి ఇళ్ల స్థలాలు స్వాధీనం చేశారు. ప్రతి ఇంటి స్థలం సరిహద్దు రాయిపై ప్లాటు వివరాలు వేశారు. కానూరు నుంచి పెద్ద ఎత్తున లబ్ధిదారులు వణుకూరుకు తరలివచ్చి ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాన్ని అధికారులు చూపించటంతో ఆనందంగా ఉబ్బితబ్బిబ్బయ్యారు. పెనమలూరులో ఇంత పెద్దఎత్తున ఒకేసారి 3 వేలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు స్వాధీనం చేయటం ఒక చరిత్ర సృష్టించింది.

గృహాలు నిర్మాణం చేసుకోండి...

కానూరులో 3078 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు స్వాధీనం చేశామని, లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మాణం చేసుకోవాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు విజ్ఞప్తి చేశారు. ఆయన వణుకూరు లేఅవుటులో గురువారం లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గృహాలు నిర్మాణం చేసుకోవటానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. సబ్సిడీ ధరకు సిమెంట్, ఐరన్ ఇస్తామని, నాలుగు ట్రాక్టర్లకు ఉచిత ఇసుక కూపన్లు అందజేస్తామని అన్నారు. డ్వాక్రా సభ్యురాలికి రూ.50 వేలు రుణం, డ్వాక్రా సభ్యత్వం లేకపోతే గృహలక్ష్మి పథకం కింద బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మాణం చేసుకోని గృహ యజమానులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, చాంద్‌బాషా, అంబటి రమేష్, శ్రీనివాసరెడ్డి, సైకం చినబాబు, అయూబ్‌ఖాన్, దాసరి రవి, బందెల రాజు, నల్లమోతు జీవన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న కమిషనర్ ప్రకాశరావు

సంక్షిప్తం

సిఫారసు మేరకే యాజమాన్య చర్యలు చేపట్టాలి

కంకిపాడు: సిఫారసు మేరకే రైతులు యాజమాన్య చర్యలు చేపట్టాలని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త (కీటక విభాగం) డాక్టర్ సుధారాణి సూచించారు. జిల్లా వనరుల కేంద్రం బృందం పునాదిపాడు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను గురువారం సందర్శించింది. దాళ్వా వరి పొలాలను పరిశీలించి పంటను ఆశించే దోమపోటు యాజమాన్యంపై రైతులకు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ సిఫారసు మేరకు, మోతాదు మించకుండా యాజమాన్య చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత గల పంటను మార్కెట్‌కు తరలిస్తేనే ఆశించిన ధరలు లభిస్తాయన్నారు. సేంద్రియ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం శిక్షణ విభాగం కోఆర్డినేటర్ కె.జ్యోతిరమణి, పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.పద్మజ, వీఏఏ కె.పావని, రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి

కంకిపాడు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్ సూచించారు. పునాదిపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పమిడిముక్కల, తోట్లవల్లూరు, ఉయ్యూరు మండలాలకు చెందిన పమిడిముక్కల, గోపవానిపాలెం, గరికపర్రు, యాకమూరు, పెద ఓగిరాల, ఆకునూరు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, షెడ్డు మిత్రలు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రంకు తరలించాలన్నారు. వర్మీకంపోస్టు తయారీ, విక్రయం ద్వారా భూసారం పెంపుదలతో పాటు పంచాయతీ ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. జిల్లా రిసోర్సు పర్సన్ నవరత్నం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, మునిరాజు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, ఉయ్యూరు మండలాల అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ హుండీ కానుకల ఆదాయం రూ.13.54 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకల ఆదాయం రూ.13.54 లక్షలు వచ్చినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఏలూరురోడ్డులోని యనమదల రామస్వామి ధర్మసత్రంలో గురువారం అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ కానుకల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. గత 85 రోజులకు గానూ రూ.13 లక్షల 54 వేల 543 వచ్చినట్లు తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య తెలిపారు. ఆమె గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 24వ తేదీ వరకూ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. కళాశాల కార్యాలయంలో సైతం దరఖాస్తులు అందజేయవచ్చని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్‌కు ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

గన్నవరం: పెరటి కోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం మండలంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ చేయూతలో భాగంగా పెరటి కోళ్ల 60 యూనిట్లను ఏపీఎం మాధవీతో కలిసి జెడ్పీటీసీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్ కింద ఎనిమిది పెట్టలు, మూడు పుంజులు, 25 కిలోల దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రాంతి పథం సిబ్బంది రాణి, నాగలక్ష్మి, మాణిక్యం, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళలకు సత్కారం

గన్నవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలువురు మహిళా ప్రతినిధులను సత్కరించారు. దావాజీగూడెంలోని స్పందన మానసిక వికాస కేంద్రం కార్యదర్శి సంకాబత్తుల రజిత, గన్నవరం గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్ర భవానిని సత్కరించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, వాకర్స్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, పీఈటీ దనియాల నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు

గన్నవరం: రూరల్ మండలంలోని వీరపనేనిగూడెం, జక్కులనెక్కలం గ్రామ సచివాలయాల వద్ద గురువారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామసభలు జరిగాయి. డీఆర్‌పీ(జిల్లా రిసోర్స్ పర్సన్)లు పాల్గొని గతంలో ఆయా పంచాయితీల పరిధిలో జరిగిన పనులను తనిఖీ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

వర్మీ ఎరువుల తయారీ ద్వారా ఆదాయం

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురంలో ఉన్న ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో గురువారం చెత్త నుంచి సంపద తయారీపై ఉంగుటూరు, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన పంచాయతీ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణ, కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు ప్రారంభించారు. ఉంగుటూరు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. దీనివల్ల గ్రామ పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు అవసరమైన వర్మీ ఎరువులను సరఫరా చేయవచ్చని తెలిపారు. ఉంగుటూరు ఈఓపీఆర్డీ బాషా, పంచాయతీ కార్యదర్శి ఏఎస్‌ఆర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదివితేనే భవిష్యత్

కేసరపల్లి(గన్నవరం): క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకునే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారులోని వీకేఆర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. అనంతరం వెంకట్‌తో పాటు కార్యదర్శి జీఎస్‌ఎల్ఎన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, అధ్యాపకులను దుశ్శాలువాలతో సత్కరించారు.

దేవస్థాన భూమిలో రహదారి నిర్మాణం

- సర్వే చేయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించిన దేవదాయ శాఖ అధికారులు


దేవస్థానం భూమిలో ఏర్పాటుచేసిన ఫెన్సింగ్

కంకిపాడు: దేవస్థానం భూమి ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేసినట్టు స్థానికులు అందించిన ఫిర్యాదుతో దేవదాయశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. హుటాహుటిన భూ సర్వే చేయించి సరిహద్దులు విడగొట్టి దేవస్థానం భూమి పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఉన్న శ్రీ భ్రమరాంబ చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం వెనుక వైపున ఆర్ ఎస్ నంబరు 123/3లో 48 సెంట్ల భూమి ఉంది. ఈ భూమికి కౌలు రూపంలో ఏడాదికి రూ.6 వేలు ఆదాయం లభిస్తోంది. ఇటీవల దేవస్థానంకు చెందిన కొంత భూమి గుండా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రబ్బిష్ రోడ్డును నిర్మాణం చేశారు. విషయాన్ని గుర్తించిన స్థానికులు దేవదాయశాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవదాయశాఖ ఈఓ గంగాధర్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో దేవస్థానం భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించారు. దేవస్థానంకు చెందిన 48 సెంట్ల భూమిని పరిరక్షించేలా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గురువారం దేవదాయశాఖ ఈఓ గంగాధర్ ఫెన్సింగ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా సర్వే చేయించి హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించామన్నారు. దేవస్థానం భూమి ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించామని వివరించారు.

గృహాల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి


ప్రసంగిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీలో గృహాల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించి జగనన్న కాలనీలలో గృహాల నిర్మాణం చేపట్టి వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహాలు నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ఇసుక కూపన్లు, భవన మెటీరియల్ సకాలంలో అందజేయాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం కూడా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సునితాశర్మ, ఏఈ రాజు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో ప్రయోజనం


డ్రోన్ ద్వారా భూముల రీ సర్వే ప్రక్రియ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: భూముల రీ సర్వే ప్రక్రియ ఎంతో ప్రయోజనకరమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. డ్రోన్ ద్వారా విలేజ్ మ్యాపింగ్ తయారీ పనులను ఉప్పలూరులో గురువారం ప్రారంభించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భూ వివాదాలను, రికార్డుల్లో ఉన్న తప్పులను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. అడంగల్‌లో పేర్లు మారకున్నా, అనుభవ స్వభావాలు మారినా, సర్వే నంబర్లలో మార్పులను సవరించుకోవటానికి రీ సర్వే దోహదపడుతుందన్నారు. గ్రామకంఠాలను పూర్తి స్థాయిలో సర్వే చేసి దస్తావేజులను అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ రీ సర్వే ప్రక్రియకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దుర్గగుడి బోర్డు మాజీ డైరెక్టర్ నెరుసు సతీష్, వైఎస్సార్‌సీపీ నేత లాం సురేష్, సచివాలయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ప్రగతి సాధించాలి

కంకిపాడు: మహిళలు స్వయం ఉపాధితో ప్రగతి సాధించాలని వక్తుల సూచించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మహిళలు ర్యాలీ నిర్వహించారు. ట్రినీస్ కాలనీలో మొక్కలు నాటారు. బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంధ్యారాణి మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రావీణ్యం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బీఐఆర్‌ఈడీ, సత్యసాయి సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం, జర్దోసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువతులు, సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రమణమ్మ చెరువులో పూడిక తీత పనులు ప్రారంభం

గన్నవరం: మండలంలోని బుద్ధవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రమణమ్మ చెరువు కాలనీలో డ్రైనేజీ పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. పొక్లెయిన్‌తో పూడికతీత పనులను గ్రామ సర్పంచి బడుగు బాలమ్మ ప్రారంభించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మురుగునీటి క్రమబద్ధీకరణకు పూడికల తొలగింపు, మరమ్మతుల పనులు చేపట్టినట్లు సర్పంచ్ చెప్పారు. కాలనీలో సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు కాలనీవాసులు కూడా సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సత్యబాబు సూచించారు.

ముమ్మరంగా కాల్వల పూడిక తీత

రామవరప్పాడు: నిడమానూరులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి గురువారం పూడిక తీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంతో పాటు పలు అంతర్గత రహదారుల్లో పారిశుధ్య సిబ్బంది పూడిక తీసి మురుగునీరు సజావుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు తెలిపారు. కాల్వగట్టు ప్రాంతం, ప్రధాన గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లు పూడుకుపోయాయని మురుగునీరు సజావుగా ప్రవహించే నిమిత్తం పూడిక తీత పనులు నిర్వహించినట్లు తెలిపారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.